నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, గురువారం 21 నవంబర్ 2024 | MEDAK

రేవంత్.. ఫెయిల్యూర్ సీఎం

గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 20: మంచి చేస్తాడని ప్రజలు ఓట్లేస్తే, గద్దెనెక్కాక తప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ అందరినీ ఇబ్బందులకు గురిచేస్తూ రేవంత్‌రెడ్డి ఒక విఫల సీఎంగా మిగిలాడని బీఆర్ఎస్ గజ్వేల్ సెగ్మెంట్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాది కావస్తున్నా ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజలకు ఏమి చేశారని విజయోత్సవాలు జరుపుకొంటున్నారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, వందశాతం రుణమాఫీ చేయాలని, పింఛన్ రూ.4వేలు పెంచాలని, ఆడబిడ్డలకు రూ.2500 ఇవ్వాలని, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఆడబిడ్డలకు స్కూటీలు ఇవ్వాలని, కల్యాణలక్ష్మితో తులం బంగారం ఇవ్వాలని, అన్నిరకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల ఇండ్లను కూల్చినందుకా... రాష్ర్టాన్ని ఆర్థికంగా దివాలా తీస్తున్నందుకా... ఎందుకు విజయోత్సవ సభలు నిర్వహించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. చేతకాక పిచ్చికూతలు కూస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెప్పుతారని వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ అద్భుతంగా పురోగమించిందని, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ర్టాన్ని తిరోగమన బాట పట్టించిందని విమర్శించారు. ఏ ఊరికెళ్లినా కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమం కనబడుతుందని, రేవంత్‌రెడ్డికి కేసీఆర్ పెట్టిన భిక్షే ముఖ్యమంత్రి పదవి అన్నారు. కేసీఆర్ మహావృక్షమని, ఆయన ఆనవాళ్లు ఎక్కడకెళ్లినా కనిపిస్తాయన్నారు.

తంగళ్లపల్లిలో ఊపిరాడక రైతు మృతి

రాజయ్య మృతదేహం

కోహెడ, నవంబర్ 20: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లిలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. లింగాల రాజయ్య(57) అనే రైతు బుధవారం తన వ్యవసాయ పొలం వద్ద వరికొయ్యలను కాల్చాడు. ఈ క్రమంలో పొగలు బాగా లేచి ఊపిరాడక ఆయన చేనులోనే చనిపోయాడు. కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఎస్సై అభిలాష్ కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతుడు లింగాల రాజయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. వానకాలం వరికోతలు పూర్తయిన తర్వాత వరికొయ్యలు కాల్చవద్దని, కాల్చిచే భూసారం దెబ్బతింటుందని, భూమిలో అలాగే దుక్కిదున్నితే భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కానీ, రైతులు ఆ సూచనను పట్టించుకోక ఇలా ప్రమాదాల బారిన పడుతున్నారు.

తలోదారి..!

కాంగ్రెస్ అధిష్టానానికి మింగుడుపడని పటాన్‌చెరు పాలిటిక్స్

- పార్టీ ఒక్కటైనా.. జతకలవని ముగ్గురు నేతలు
- ఇప్పటి వరకు ఒకే వేదిక పంచుకోని మహిపాల్‌రెడ్డి, కాటా, నీలం
- పార్టీ కార్యక్రమాలకు మహిపాల్‌రెడ్డి, కాటా దూరం
- పీసీసీ చీఫ్ సమావేశానికి ఇద్దరు నేతల డుమ్మా
- ముగ్గురు మధ్య కొనసాగుతున్న 'పవర్' పాలిటిక్స్
- క్యాడర్ అయోమయం..స్థానిక సంస్థల ఎన్నికల గుబులు

సంగారెడ్డి, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి క్యాడర్‌కే కాదు అధిష్టానానికి అంతుపట్టడం లేదు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపించాల్సిన ముఖ్యనేతలు ముగ్గురు తలోదారి పట్టడమే ఇందుకు కారణం. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేగా పోటీచేసిన కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీగా పోటీచేసిన నీలం మధు ఎవరికివారే సొంత ఎజెండాతో పనిచేస్తుండడం కాంగ్రెస్ అధిష్టానానికి జీర్ణంకావడం లేదు. ముగ్గురు నేతలు ఇప్పటి వరకు ఒకే వేదికపైకి కలిసి రాలేదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన కాటా శ్రీనివాస్‌గౌడ్ సైతం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. మూడురోజుల క్రితం సంగారెడ్డిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి దామోదర్ హాజరయ్యారు. ఈ సమావేశానికి సైతం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాటా శ్రీనివాస్‌గౌడ్ డుమ్మా కొట్టారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాలకు, పార్టీ కార్యక్రమాలకు సైతం ఇరువురు నేతలు దూరంగా ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమాన్ని పటాన్‌చెరు నియోజకవర్గంలోని చిట్కుల్‌లో మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాటా శ్రీనివాస్‌గౌడ్ హాజరు కాలేదు. మంగళవారం పార్టీ నిర్వహించిన ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమానికి ఇద్దరు నేతలు దూరంగానే ఉన్నారు. మంత్రి దామోదర అనుచరుడిగా పేరున్న కాటా శ్రీనివాస్‌గౌడ్ దామోదర హాజరయ్యే కార్యక్రమాల్లో సైతం పాలుపంచుకోవడం లేదు. మంత్రి దామోదర్, కాటా శ్రీనివాస్‌గౌడ్ మధ్య పొరపొచ్చాలు వచ్చాయని, దీంతో కాటా శ్రీనివాస్‌గౌడ్ పార్టీకి దూరంగా ఉంటున్నట్లు ప్రచారం జరుగుతున్నది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నీలం మధు పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నప్పటికీ.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాటా శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పనిచేయడం లేదు. ముగ్గురు నేతల వ్యవహారం పార్టీకి నష్టం కలిగిస్తున్నదని పటాన్‌చెరులోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురు నేతల తీరు ఇలాగే కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ దెబ్బతినడం ఖాయమని అటు అధిష్టానం.. ఇటు క్యాడర్ ఆందోళన చెందుతున్నది.

అధిష్టానంపై ఎమ్మెల్యే కినుకు

పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట. తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇక్కడ జరిగిన ఎమ్మెల్యేతో పాటు అన్ని ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయ ఢంకా మోగించింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు చెందిన మహిపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి కాటా శ్రీనివాస్‌గౌడ్ పోటీ చేసి ఓటమి చెందారు. తన ఇంటిపై ఐటీ దాడులు జరగడం, సోదరుడి మధుసూదన్‌రెడ్డిపై పోలీసు కేసు నమోదు కావడంతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన తనకు పదవి ఇవ్వడంతో పాటు నియోజకవర్గంలో పవర్ అప్పగిస్తారని మహిపాల్‌రెడ్డి ఆశించారు. కానీ, రేవంత్‌రెడ్డి సర్కార్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఎలాంటి పవర్ కట్టబెట్టలేదు. దీనికితోడు కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు, మంత్రులు మహిపాల్‌రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఇది మహిపాల్‌రెడ్డికి జీర్ణం కావడం లేదు. దీంతో కాంగ్రెస్ తీరును నిరసిస్తూ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. ఎమ్మెల్యే అయిన తన ఒక్కడికే నియోజకవర్గానికి సంబంధించి పూర్తి బాధ్యతలు అప్పగించాలని మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. తాను ఓటమి పాలైనప్పటికీ మిగతా నియోజకవర్గాల తరహాలోనే తనకు పార్టీ, ప్రభుత్వ బాధ్యతలు అప్పగించాలని కాటా శ్రీనివాస్‌గౌడ్ కోరుకుంటున్నారు. అధిష్టానం మాత్రం ఆయనకు ఆ బాధ్యతలు అప్పగించడం లేదు. ఈ కారణంగానే శ్రీనివాస్‌గౌడ్ పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని తెలుస్తున్నది. మరోనేత నీలం మధు ముదిరాజ్ సైతం పార్టీ పదవిని ఆశిస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో తన గెలుపుకోసం సొంత పార్టీ నేతలు పనిచేయలేదని, తనకు వ్యతిరేకంగా పనిచేసిన ఇద్దరు ముఖ్యనేతలను పక్కన బెట్టి పార్టీ కోసం పనిచేస్తున్న తనకు మాత్రమే ఎమ్మెల్సీ పదవితోపాటు నియోజకవర్గం పూర్తి బాధ్యతలు ఇవ్వాలని ఆయన కోరుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాటా శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పనిచేసేందుకు నీలం మధు ససేమిరా అంటున్నట్లు సమాచారం. పటాన్‌చెరు నియోజకవర్గంలో ముగ్గురు కీలక నేతలు తలోదారి పట్టడంతో ఏమిచేయాలో తెలియక కాంగ్రెస్ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

మళ్లీ మిషన్ భగీరథ నీళ్లు బంద్

ఆందోళన బాటలో మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు

కార్మికులతో మాట్లాడుతున్న సంబంధిత జిల్లా అధికారులు, కాంట్రాక్టర్(ఫైల్)

జహీరాబాద్, నవంబర్ 20: వేతనాల చెల్లింపులో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నాలుగోసారి ఆందోళన బాటపట్టేందుకు సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు సిద్ధమయ్యారు. ఇటీవల వీరు ఆందోళన చేపట్టగా, ఒక నెల జీతాన్ని అందజేసి, మిగిలిన ఆరు నెలలకు సంబంధించి ఈనెల 20వ తేదీలోగా చెల్లిస్తామని సంబంధిత అధికారుల సమక్షంలో కాంట్రాక్టర్ ఒప్పంద పత్రాన్ని రాసి అందజేశారు. ఇచ్చిన ఒప్పందం ప్రకారం బుధవారం కార్మికులకు వేతనాలను చెల్లించకపోవడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. బుధవారం అర్ధరాత్రి నుంచి రాఘవపూర్ ఫిల్టర్‌బెడ్ నుంచి గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల్లో దాదాపు 75 గ్రామాల ప్రజలకు మళ్లీ క'న్నీటి కష్టాలు' మొదలయ్యాయి. సంబంధిత జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నారంలో రెవెన్యూ అధికారుల విచారణ

అన్నారంలో విచారణ చేపడుతున్న ఆర్ఐ నివాస్‌రెడ్డి, పాల్గొన్న గ్రామస్తులు

గుమ్మడిదల, నవంబర్ 20: గుమ్మిడిదల మండలంలోని అన్నారంలో 261 సర్వేనంబర్ ప్రభుత్వభూమిలో ఎక్స్‌సర్వీస్‌మెన్, కోఆపరేటీవ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ పేరుతో ఎలాంటి కార్యకలాపాలు జరగడం లేదని విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలు, తహసీల్దార్ గంగాభవానీ సూచన మేరకు బుధవారం మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. 25-30 ఏండ్ల క్రితం ప్రభుత్వం ఎక్స్‌సర్వీస్‌మెన్లకు వ్యవసాయం చేసుకోవడానికి భూములను అందజేసిందన్నారు. ఆ ఎక్స్‌సర్వీస్‌మెన్లు ఎక్స్‌సర్వీస్‌మెన్, కోఆప్‌రేటీవ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీని ఏర్పాటు చేయగా, ఆ ప్రాంతానికి ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీగా వాడుకలోకి వచ్చిందన్నారు. ఎక్స్‌సర్వీస్‌మెన్, కోఆప్‌రేటీవ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ ఏర్పాటు జరిగిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వ్యవసాయ కార్యకలాపాలు చేయలేదన్నారు. దీంతో ఎక్స్‌సర్వీస్‌మెన్లకు ఇచ్చిన సర్టిఫికెట్లను రద్దు చేసి వారికి కేటాయించిన భూమిని నిరుపేద ఎస్సీ కులస్తులకు అసైన్‌మెంట్ ద్వారా ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఆ సర్వేనంబర్ 261లో స్థానికంగా ఉన్న వంద కుటుంబాలు ఇండ్లు నిర్మించుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పించిన జీవో 58,59 ద్వారా అస్సెస్‌మెంట్ పట్టా సర్టిఫికెట్లు ,పంచాయతీ ద్వారా ఇంటి నంబర్లు మంజూరు జరిగినట్లు విచారణలో తెలుసుకున్నట్లు ఆర్ఐ తెలిపారు. ఈ సర్వే నంబర్‌భూముల్లో డంపింగ్‌యార్డు, రోడ్డు, ఈద్గా నిర్మించి ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. విచారణ నివేదిను హైకోర్టుకు నివేదించనున్నట్లు ఆర్ఐ తెలిపారు. విచారణలో జీపీ ఈవో సంగీతా నాయక్, మాజీ సర్పంచ్ మురళి, నాయకులు మద్ది వీరారెడ్డి, కావలి ఐలేశ్, తుపాకుల రాజు, సంఘం శేఖర్‌గౌడ్, దర్గా భిక్షపతి, దేశబోయిన దశరథ్, ఎరుకలి కిషన్, బాలకిషన్, బోసు, నారాయణ, యేహాన్, వెంకటేశ్, పల్నాటి సత్యనారాయణ, నగేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతులకు సన్మానం

- ముగిసిన సహకార వారోత్సవాలు

గుమ్మడిదలలో ఆదర్శ రైతులు సన్మానిస్తున్న ఎండీ అన్నపూర్ణ

గుమ్మడిదల, నవంబర్ 20: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలోని రైతు వేదిక వద్ద బుధవారం సహకార వారోత్సవాల ముగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర సహకార శాఖ ఎండీ అన్నపూర్ణ, జాయింట్ రిజిస్ట్రార్లు ధాత్రిదేవి, వెంకటేశ్వర్లు, సంగారెడ్డి జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు సువర్ణ, జైపాల్‌రెడ్డి, ప్రశాంత్, రంగారెడ్డి, దేవేందర్, తిరుపతి, లక్ష్మారెడ్డి, ఎండీ యాదుల్, యాదిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణవేణిని సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఒకప్పుడు గుమ్మడిదల పీఏసీఎస్ సంఘం అద్దె భవనంలో కొనసాగిందని, ఇప్పుడు రెండంతస్తుల సొంత భవనం ఏర్పాటు చేసుకుని రైతులకు సహకారం అందిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌రావు, ఏఈవో నిఖిత, డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, పీఏసీఎస్ సీఈవో లచ్చిరాంనాయక్, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, మద్దులబాల్‌రెడ్డి, ధర్మారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

చలికి గజగజ

మద్దూరులో చలి మంట కాచుకుంటున్న చిన్నారులు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 20: మూడు నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గిపోతుండడంతో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కనిష్ట స్థాయిలో నమోదవుతున్నాయి. తెల్లవారుజామున పొగమంచు కారణంగా ఉదయం 8గంటల వరకు ఇంటి నుంచి కాలు బయట పెట్టేందుకు జనం వణికిపోతున్నారు. రాత్రివేళ చలి తీవ్రత నుంచి కాపాడుకునేందుకు గ్రామాల్లో ప్రజలు చలిమంటలు కాస్తున్నారు. ఇప్పుడే చలి తీవ్రత ఇలా ఉంటే, రానున్న రోజులలో మరింత తీవ్రంగా ఉండనుందని ప్రజలు జంకుతున్నారు. చలి నుంచి రక్షణకు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. పట్టణాల్లో ఉన్ని దుస్తుల విక్రయాల షాప్‌లు వెలియడంతో కొనుగోళ్లతో సందడిగా మారాయి.

ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సహించండి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 20: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉందని, రైతులను ఒప్పించి సాగుకు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి వ్యవసాయ, హార్టికల్చర్, ఆయిల్‌ఫెడ్ అధికారులకు సూచించారు. ఆయిల్‌పామ్ సాగుపై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పెంపకంతో రైతులకు రెగ్యులర్‌గా ఆదాయం పొందవచ్చని, అంతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ప్యాక్టరీ నిర్మాణం వేగంగా జరుగుతున్నందున రైతులకు మార్కెటింగ్ సౌకర్యం సులభతరం అవుతుందని తెలిపారు. రైతులతో సమావేశాలు నిర్వహించి సాగుకు ముందుకు వచ్చేలా కృషిచేయాలన్నారు. వ్యవసాయ క్లస్టర్ల వారీగా లక్ష్యం నిర్దేశించుకొని పంట సాగుచేయించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు రెగ్యులర్‌గా విజిట్ చేసి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, హార్టికల్చర్ అధికారి సువర్ణ, వ్యవసాయ అధికారి రాధిక పాల్గొన్నారు.

పటాన్‌చెరు ఎస్‌హెచ్‌వోగా వినాయక్‌రెడ్డి

- సీఐ ప్రవీణ్‌రెడ్డి బదిలీ

వినాయక్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 20: పటాన్‌చెరు ఎస్‌హెచ్‌వోగా జి.వినాయక్‌రెడ్డి నియమితులయ్యారు. ఐజీ కార్యాలయం మల్టీజోన్‌లో వెయిటింగ్‌లో ఉన్న ఆయన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు బుధవారం బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం డీఎస్పీ రవీందర్‌రెడ్డిని కలిశారు. ఏడాది కాకుండానే పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.వినాయక్‌రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నేరాలను అదుపునకు ప్రాధాన్యత ఇస్తానని మీడియాకు జి.వినాయక్‌రెడ్డి తెలిపారు.

పటాన్‌చెరులో పోస్టింగ్‌కు పోటీ...

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేయడానికి పోలీసు అధికారులు ఆసక్తి చూపిస్తారు. పవర్ పాలిటిక్స్‌కు కేంద్రంగా పటాన్‌చెరు ప్రాంతం మారింది. ఈ ప్రాంతంలో విధులు నిర్వహించడం కత్తిమీద సాములాంటిదే. ఎవరు ఎస్‌హెచ్‌వోగా వచ్చినా రెండేండ్లకు మించి విధులు నిర్వహించలేక పోతున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో కీలక బాధ్యతలు నిర్వర్తించాలంటే స్థానిక రాజకీయ నాయకుల అండదండలు ఉండాలనే ప్రచారం ఉంది. ఇప్పుడు పటాన్‌చెరు నియోజకవర్గంలో అధికార పార్టీకి ముగ్గురు నాయకులు నేతృత్వం వహిస్తున్నారు. తమకు అనుకూలమైన వారే ఎస్‌హెచ్‌వోలుగా ఉండాలని పట్టుబడి మరి పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారని సమాచారం. అందుకే వరుసగా ఎస్‌హెచ్‌వోలు బదిలీ అవుతున్నారు. ఈ పవర్ పాలిటిక్స్ కారణంగా నిజాయితీగా పనిచేసే అధికారులకు స్వేచ్ఛ కరువవుతున్నదని, ముక్కుసూటిగా పనిచేసే పోలీసు అధికారులు బదిలీ అవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఆహారం.. ఆరోగ్యం

మారుతున్న కాలానుగుణంగా ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతున్నది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వాకింగ్, జాకింగ్, జిమ్, యోగా వంటివి చేస్తూనే ఆహార నియమాలు పాటిస్తున్నారు. చలికాలం కావడంతో సిద్దిపేటలో వాకింగ్ చేసేవారి సంఖ్య ఇటీవల పెరిగింది. వాకర్లు వాకింగ్ చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం మంచి ఫుడ్ తీసుకోవాలని ఆలోచిస్తున్నారు వారికోసం సిద్దిపేటలో ఫుట్‌పాత్‌పైన రాగిజావ, గోధుమ గడ్డి జ్యూసు, గట్కా, ఫ్రూట్స్ సలాడ్, లెమన్ టీ వంటివి కొందరు విక్రయిస్తున్నారు. వాకింగ్ తర్వాత వీటిని ఆహారంగా తీసుకోవడానికి వాకర్లు ఆసక్తి చూపుతున్నారు. తద్వారా వాకర్లకు ఆరోగ్యం, చిరువ్యాపారులకు ఉపాధి దొరుకుతున్నది.

–సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నవంబర్ 20



ఘనంగా మహా పడిపూజ

అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్న భక్తులు

అమీన్‌పూర్, నవంబర్ 20: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.బుధవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గ్రీన్ మెడోస్ కాలనీలోని మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్ నివాసంలో 13వ అయ్యప్పస్వామి మహాపడి పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి మాట్లాడారు. మహాపడిపూజ కార్యక్రమానికి వెయ్యి మందికి పైగా స్వాములు హాజరయ్యారు.అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడి పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప... శరణం శరణం అయ్యప్ప... స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో బీరంగూడ మారుమోగింది.కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు,అధికారులు, మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్, ఉమారాణి దంపతులు, కన్నెస్వామి నందారం సందీప్‌గౌడ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంపు కంపు

ముత్తంగిలో రోడ్లపై పారుతున్న మురుగు

- తెల్లాపూర్ మున్సిపాలిటీలో పడకేసిన పారిశుధ్యం
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు.. జనం ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ముత్తంగిలో జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

పటాన్‌చెరు, నవంబర్ 20: కాంగ్రెస్ పాలనలో పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. దీంతో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగుతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముత్తంగి గ్రామంలో జాతీయ రహదారిపై మురుగు పారుతున్నది. తెల్లాపూర్ మున్సిపాలిటీలో ముత్తంగి పంచాయతీ విలీనం చేసిన తర్వాత పారిశుధ్య నిర్వహణ సరిగ్గా జరగడం లేదు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామాన్ని రెండు నెలల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఆ తర్వాత ప్రజలకు పారిశుధ్య సేవలు నిలిచిపోయాయి. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఆర్సీపురం మండలంలో ఉండటంతో ముత్తంగివాసులకు అన్ని రకాల సేవలు దూరభారంగా మారాయి. జాతీయ రహదారిని విస్తరిస్తూ ఒకవైపు నిర్మాణ సంస్థ పనులు చేస్తున్నది. బాక్స్‌టైప్ డ్రెయిన్లు నిర్మించేందుకు జేసీబీతో నిర్మాణ సంస్థ తవ్వకాలు చేపట్టింది. ఈ తవ్వకాల్లో ముత్తంగిలోని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పలుచోట్ల పగిలిపోయింది. అటు కాంట్రాక్టర్ ఆ మురుగు సమస్యకు దారి చూపకపోవడం, మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది దానికి ఎలాంటి పరిష్కారం ఆలోచించకపోవడంతో ప్రవహిస్తున్నాయి. నెలరోజులుగా మురుగు జాతీయ రహదారిపై దుర్వాసన వెదజల్లుతూ ప్రవహిస్తున్నా, మున్సిపాలిటీ సిబ్బందికి కనబడడంలేదు. జాతీయ రహదారి విస్తరణ కాంట్రాక్టర్ ద్వారా ఇప్పటికే మంచినీటి పైప్‌లైన్లు పలుమార్లు ధ్వంసం అయ్యాయి. ఇప్పుడు మురుగు పైప్‌లైన్లు పగిలిపోయాయి. జాతీయ రహదారి పక్కనుంచి జేసీబీ ద్వారా తాత్కాలికంగా నాలా ఏర్పాటు చేసినా, మురుగునీరు నేరుగా ఎన్కె చెరువు నాలా ద్వారా నక్కవాగు వైపు వెళ్లిపోతాయి. మరో పక్క ముత్తంగిలోని పలు కాలనీల్లోను న్యూటౌన్ కాలనీలో నెలరోజులుగా డ్రెయిన్లు పొంగి ఓపెన్ ప్లాట్లలో నీరు నిలిచిపోయింది. కాలనీ ప్రజలు దుర్వాసనతో ముక్కు మూసుకుంటున్నారు. పారిశుధ్యంపై, మురుగు సమస్యపై సిబ్బంది దృష్టిపెట్టకపోవడంతో సమస్య తీవ్రతరం అవుతున్నది. మరోపక్క తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌లో కార్లు, ద్విచక్రవాహనాలు పడిపోతున్నాయి. జాతీయ రహదారిపై నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ప్రయాణిస్తున్న మురుగు సమస్యకు పరిష్కారం లభించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

మ్యాన్‌హోల్‌లో ఇరుక్కున్న కారును బయటకు తీస్తున్న ముత్తంగివాసులు



ముత్తంగి న్యూటౌన్ కాలనీలో పారుతున్న మురుగు